క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ



స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

వేలేరు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరి శీ లించి, కేసుల వివరాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణ లో మొక్కలు నాటారు. ఆమె వెంట ధర్మసాగర్ సీఐ ప్ర వీణ్, వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్, సిబ్బంది ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన శ్రీధర్



యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడితో శ్రీధర్

ఆత్మకూరు : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిని ఆదివారం పరకాల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యూత్ నాయకులు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలని సూచించినట్లు శ్రీధర్ తెలిపారు. ఆయన వెంట యూత్ నాయకులు కార్తీక్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

నేడు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

శాయంపేట : మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నేడు (సోమవారం) మధ్యాహ్నం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించనున్నట్లు ఏఓ గంగాజమున ఆది వారం తెలిపారు. మండలంలోని రైతులు, అధికారులు సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బొక్కల నారాయణ

ఐనవోలు : జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీల నిర్మాణం, జెండా గద్దెల నిర్మాణం పూర్తి చేయడం తదితర అంశాలను చర్చించారు. మండల పరిధిలో మాదిగ ప్రజలు ఉన్న 14 గ్రామాలకు మండల ప్రధాన నాయకులు పని విభజన చేసుకున్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సింగారపు స్వామి, నాయకులు బరిగెల ఏలియా, కట్కూరి రమేష్, చంద్రమౌళి, బాబు, అనిల్, కరుణాకర్, విష్ణు, ఆర్య, మల్లేశం, బన్ని, రాకేష్, అభిషేక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు



ముగ్గు పోసే కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారులు గృహాల నిర్మాణ ప్రారంభానికి ఆదివారం ముగ్గులు పోశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెల్దె వెంకటేశ్వర్లు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్, నాయకులు వడ్డెపెల్లి వేణు, ప్రసాద్, రంపాల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లతో ప్రమాదం

- ఆహ్లాదం వెనుక దాగి ఉన్న అనారోగ్యం
- అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు వస్తాయంటున్న వైద్యులు



ముల్కనూరులోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లు

ఎల్కతుర్తి : రహదారులకు ఇరువైపులా అందంగా, ఆకర్షణీయంగా పచ్చతోరణంలా కనిపించే కోనోకార్పస్ మొక్కలు(చెట్ల)తో అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. భీమదేవపల్లి మండలంలోని పశువైద్యశాల ఎదురుగా ఆదర్శ పాఠశాలకు వెళ్లే రహదారికి ఇరువైపులా కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగి పచ్చదనంతో నిండుకొని ఆహ్లాదకరంగా ఉన్నాయి. అలాగే ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే మరికొన్ని కోనోకార్పస్ చెట్లు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని హన్మకొండ–కరీంనగర్ రహదారి పక్కనే మరిన్ని చెట్లు ఉన్నాయి. గత ప్రభుత్వ హయంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటారు. వాతావరణ ఎద్దడి తట్టుకొని మొక్కలు కాస్త ఏపుగా పెరిగి చెట్లుగా ఎదిగాయి. బాట, పాదచారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నప్పటికి కోనోకార్పస్ చెట్లు పర్యావరణ, ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయని, కోనో పుప్పొడి రేణువులు గాలిద్వారా వ్యాపించి అలర్జీ, శ్వాసకోశ వ్యాధులకు దారితీస్తుందని, అంతేకాకుండా ఈ చెట్ల వేర్ల ద్వారా భూగర్భ జలాలు క్షీణిస్తాయని వృక్ష, పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మొక్కలు, చెట్లద్వారా మానవ మనుగడకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందని గత ప్రభుత్వం మొక్కలు పెంచవద్దని ఆదేశాలు జారీ చేసింది. నాటిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటారు. కొన్నిచోట్ల నాటిన మొక్కలను తొలగించకపోవడంతో అవి కాస్తా చెట్లుగా ఎదిగాయి. చల్లటి వాతావరణాన్ని పంచుతున్నప్పటికీ వాటి వల్ల మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉండడంతో చెట్లను తొలగించి వాటి స్థానంలో ఇతర మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే ఆదర్శ పాఠశాలకు వెళ్ళే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కోనో కార్పస్ చెట్లు తొలగించి వాటి స్థానంలో దారికి ఇరువైపులా పూల మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థులు ఎలర్జీ, శ్వాసకోస వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో పూల మొక్కలు నాటాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఎల్కతుర్తి మండలం దామెర సమీపంలో రహదారి పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

కంప్యూటర్ విద్య చాలా అవసరం

- సీఐ క్రాంతికుమార్



విద్యార్థినులతో సీఐ క్రాంతికుమార్

పరకాల: నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ విద్య చాలా అవసరమని స్థానిక సీఐ క్రాంతికుమార్ అన్నారు. సాధన ఐడియల్ సొసైటీ, అక్షర కంప్యూటర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 40 రోజుల ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను సీఐ అభినందించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు కంప్యూటర్ విద్య చిన్నతనం నుంచి నేర్చుకోవడం వలన మంచి ప్రయోజకులుగా తయారవుతారన్నారు. కాలంతో పోటీపడాల్సిన రోజులని, సమయాన్ని వృథా చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో సాధన ఐడియల్ సొసైటీ కన్వీనర్ పాగాకుల రాధాకృష్ణ, కార్యదర్శి సుద్దాల రంజిత్, అక్షర కంప్యూటర్ బోధకుడు బి.అనుదీప్ పాల్గొన్నారు.

వివాహిత మృతి కారకులను శిక్షించాలి

- మహిళా సంఘాల ప్రతినిధుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న శోభారాణి

కమలాపూర్: మండల కేంద్రంలో ఇటీవల నీటిసంపులో పడి మృతి చెందిన రేణుశ్రీ మృతికి కారకులైన వారికి కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల ప్రతినిధి కుక్కల శోభారాణి డిమాండ్ చేశారు. మండలంలోని గూడూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రేణుశ్రీకి ఆరేళ్ల క్రితం వివాహం జరుగగా ఆమెకు ఇప్పటి వరకు సంతానం కలుగలేదని, దీంతో ఆమె అత్తింటి వారు తరచూ వేధించే వారని, కేవలం సంతానం కలుగలేదన్న సాకుతో అత్తింటి వారు రేణుశ్రీని హత్య చేసి నీటి సంపులో పడేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. రేణుశ్రీని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన వారిపై పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేణుశ్రీని హత్య చేసిన ఆమె అత్తింటి వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించకపోతే జిల్లా కేంద్రంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహిళలను వేధిస్తూ హత్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలకు ఆదేశించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మహిళా సంఘాల ప్రతినిధులు బీరకుంట్ల చంద్రకళ, కోమల, సంగనేని కల్యాణి పాల్గొన్నారు.

బ్యాంకు కాలనీలో కరువైన పరిశుభ్రత

- అంగన్‌వాడీ సెంటర్ ఎదుట అస్తవ్యస్తంగా చెత్తకుప్పలు



ఎస్‌బీఐ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద పడేసిన చెత్త

శాయంపేట : స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ ముందు పరిశుభ్రత కరువైంది. వేసవి సెలవులు ముగిసిపోయి అంగన్‌వాడీ సెంటర్లు తెరుచుకున్నాయి. అయినా అంగన్‌వాడీ సెంటర్ల ముందు శుభ్రం చేయకుండా కుప్పకుప్పలుగా చెత్త వేయడంతో అంగన్‌వాడీకి వచ్చే గర్భిణీలు, బాలింతలు, పిల్లలు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. వర్షాలు కురుస్తుండడంతో చెత్త కుప్పలు ముగిపోయి దుర్వాసనతో దోమలు ప్రబలి పిల్లలను కుట్టే అవకాశం ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రంలో ఉండే అంగన్‌వాడీ సెంటర్ ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలు ఎలా ఉంటాయో అని ప్రజలు ముక్కుపై వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ అధికారులు చొరవ తీసుకొని ఎలాంటి చెత్త లేకుండా శుభ్రం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీతో వృథాగా తాగునీరు



పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

శాయంపేట : మండల కేంద్రంలోని కుమ్మరి వాడలో గ్రామపంచాయతీకి సంబంధించిన మంచినీటి పైపులైన్ మూడు రోజులుగా లీకేజీ అయి రోడ్డుపై తాగునీరు వృథాగా పోతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివారం 'సాక్షి' క్లిక్ మనిపించింది. మండల కేంద్రంలో కుమ్మరివాడలో గ్రామపంచాయతీకి చెందిన మంచి నీటి పైపులైన్ లీకేజీ కావడంతో ఉదయం నుంచి నీరు వృథాగా పోతుందని వెంటనే జీపీ అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతు చేపట్టి నీరు వృథా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పంథిని పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని పంథిని, కొండపర్తి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పంథినిలో 1991–92, కొండపర్తిలో 2002–03లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సుదీర్ఘ కాలం తర్వాత ఒకచోట కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నృత్యాలు చేసి సందడి చేశారు. ఆనాటి గురువులను పూజించుకుని ఘనంగా సత్కరించారు. పంథిని, కొండపర్తిలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, భిక్షపతి, కుమారస్వామి, అబ్దుల్ అలీ, సమ్మయ్య, సాంబయ్య, సుధాకర్‌రావు, బాబురావు, సంపత్, మధుసూదన్, విద్యార్థులు వీరస్వామి, మురళీకృష్ణ, సుమంత్, మోహన్, భాగ్యలక్ష్మి, కిరణ్, రాజు, శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో ఆదివారం రాత్రి వివిధ కుల సంఘాల నాయకులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సహకరించాలని కోరారు. దీనికి గ్రామస్తులు సానుకూలంగా స్పందించారు. గ్రామంలో అందరు కలిసి కట్టుగా ఉంటూ అభివృద్ధి సాధించాలని కోరారు.

21న ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న పట్టణ ప్రజలు

పరకాల : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన యోగా గురువు కొలుగూరి రాజేశ్వర్‌రావు ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరకాలలోని గణపతి కళాశాలలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తున్న యోగా శిక్షణకు పట్టణ ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యోగా చేయడం వలన ఎన్నో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్, అస్తమా, థైరాయిడ్ సమస్యలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రాజేశ్వర్‌రావు అన్నారు. యోగా శిక్షణలో పాల్గొనే వారు మ్యాట్ తీసుకొచ్చుకోవాలని సూచించారు.

నేడు రైతు వేదికలో వీడియో ప్రత్యక్ష ప్రసారం

పరకాల: రైతు భరోసా పథకం నిధుల విడుదల సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణంలోని రైతు వేదికలో నేడు (సోమవారం) వీడియో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పరకాల ఏఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా వానాకాలం 2025 కోసం కొత్తగా పట్టదారుల పాస్‌పుస్తకాలు జూన్ 5 వరకు వచ్చిన రైతులంతా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు. ఈ పథకానికి 18 వరకు చివరి రోజుగా ఏఓ తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ : మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన వంగ మొగిలి, బొందయ్య, కన్నెబోయిన చంద్రయ్య ఇటీవల మృతి చెందగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో మండల, గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

అధ్వానంగా మార్కెట్ రోడ్డు



గోదాం వద్ద మట్టిలో దిగబడిన లారీ



రోడ్డును చూసి ఆందోళన చెందుతున్న హమాలీలు

- మార్కెట్ గోదాముకు వెళ్లే దారి బురదమయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పరకాల : పరకాల నాబార్డు సహకారంతో గత ప్రభుత్వ హయాంలో 7 వేల మెట్రిక్ టన్నుల గోదాంలు ఉన్నా..సీసీ రోడ్డు లేకపోవడంతో మార్కెట్‌కు సరుకులు తీసుకురావాలన్నా..తీసుకవెళ్లాలన్నా లారీలు వెళ్లడానికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది 5 వేల మెట్రిక్‌టన్నుల గోదాంలో బియ్యం దింపడానికి మార్కెట్ అధికారులతో పౌర సరఫరాల శాఖ ఒప్పందం చేసుకుంది. మరో గోదాం 2వేల మెట్రిక్ టన్నుల పరకాల వ్యవసాయ మార్కెట్ గోదాంల నిర్మాణం తప్ప సీసీ రోడ్లు నిర్మాణం చేయకపోవడంతో లారీల రాకపోకలకు.. బియ్యం బస్తాలు 125 అడుగుల దూరం మోయడానికి హమాలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం బస్తాలను మార్కెట్ గోదాంలో నిల్వచేయడానికి చేరుకుంటున్న లారీలు మట్టిరోడ్డులో దిగబడుతూ సరుకుల దిగుమతి ఆలస్యంగా జరుగుతుందని హమాలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులు మార్కెట్ గోదాం సీసీ రోడ్లపై దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



గోదాం వద్ద రోడ్డు

సీసీ రోడ్డు వేయాలి



వరంగల్ మార్కెట్ తర్వాత అత్యధికంగా నిల్వ చేసుకోవడానికి పరకాల వ్యవసాయ మార్కెట్‌లోని గోదాంలే ప్రధానం ఆధారం. తక్షణమే అధికారులు, పాలకులు స్పందించి గోదాం చుట్టూ సీసీ రోడ్డు వేసి బురద సమస్య నుంచి రక్షించాలి. లేనిపక్షంలో హమాలీలు అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకోవాల్సి వస్తుంది.

– లంకదాసరి అశోక్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు

స్ప్రింక్లర్లతో పత్తి మొక్కలకు నీరు



మండల కేంద్రానికి చెందిన రైతు నడిగొట్టు సత్యం 20 రోజుల క్రితం తనకున్న నాలుగు ఎకరాల్లో పత్తి గింజలు నాటాడు. వర్షాలు పడకపోవడంతో మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉండడంతో మొలకెత్తిన విత్తనాలు కాపాడుకోవడానికి రైతు కుటుంబ సభ్యులతో కలిసి స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసి మొక్కలకు నీరు అందిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. – శాయంపేట

ఉత్తమ ఫలితాలతో స్ఫూర్తినివ్వండి

సంగెం : విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఇతరులకు స్ఫూర్తినివ్వాలని ప్రముఖ వ్యాపారవేత్త రావిపాటి వెంకటేశ్వర్‌రావు, సామాజికవేత్త పులి రాజశేఖర్ కోరారు. మండలంలోని పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 150 మంది విద్యార్థులను మార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం మెమోంటో, పూల బొకే అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు, రాజశేఖర్ మాట్లాడారు. విద్యార్థులు చదువుల్లో రాణించి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదిగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. తల్లిదండ్రుల, మండల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ముందుంటామని చెప్పారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడైన సామాజికవేత్త రాజశేఖర్‌ను వెంకటేశ్వర్‌రావు, ఇతరులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళావతి, ఎస్సై నరేశ్, కేయూ ప్రొఫెసర్ వాసం శ్రీనివాస్, తహసీల్దార్ తోట రవీందర్, సైకాలజిస్ట్ సురేశ్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నరహరి, లింగమూర్తి, కోటేశ్వర్, శ్రీనివాస్, రాజు, మధు, రమేశ్, చంద్రారెడ్డి, చందర్‌రావు, మల్లయ్య, కొమురయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీపీఎఫ్ నాయకులు

కాజీపేట అర్బన్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం ఆధ్వర్యంలో హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 29, 30వ తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న టీపీఎఫ్ 4వ రాష్ట్ర మహాసభల్లో ప్రజాస్వామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ సంజీవ్‌రావు, అంబటి అంబన్న, ప్రవీణ్‌కుమార్, పాకాల వెంకన్న, యాకన్న, చార్వాక, నాగరాజు, సోమన్న, కవిత, ప్రభాకర్ పాల్గొన్నారు.